# ప్రజాస్వామ్యంలో ఓటు విలువైంది





మాట్లాడుతున్ననియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు సత్యనారాయణ

రంపచోడవరం, న్యూస్‌టుడే

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనదని డబ్బులకు, ప్రలోభాలకు ఆకర్షితులు కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌వీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ఈనాడు', 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్'. 'ఈటీవీ భారత్', ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన ఓటరు నమోదు, అవగాహన సదస్సుకు విశేష స్పందన వచ్చింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్నికల డీటీ సత్యనారాయణ మాట్లాడుతూ 18 ఏళ్లు వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఓటు వజ్రాయుధం లాంటిదని.. మంచి నాయకుడిని గుర్తించి ఓటు వేయడం ద్వారా అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా స్వార్థపరులను ఎన్నుకోవడం సమాజానికి మేలు చేయదన్నారు. డబ్బు తీసుకుని ఓటేస్తే అయిదేళ్లలో మనకు ఏదైనా అవసరం వచ్చినా, సమస్యలపై ప్రశ్నించేందుకు హక్కును పూర్తిగా కోల్పోతామన్నారు. నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు నమోదుకు ఫారం-6, జాబితాలో పేర్లు తొలగింపుకు ఫారం-7, ఒక పోలింగ్ బూత్ నుంచి మరో పోలింగ్ బూత్‌కు పేర్లను మార్చుకొనేందుకు ఫారం-8ఎ ద్వారా చేసుకొనే అవకాశం ఉందన్నారు. దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగకుండా మంచి నాయకున్ని ఎన్నుకొనేందుకు ఓటర్లంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఎన్నికల సీనియర్ అసిస్టెంట్లు లక్ష్మణరావు, ఇందిర, వీఆర్వోలు గణపతిరెడ్డి, ప్రభాకర్, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, అధ్యాపకులు పద్మాకర్, వెంకటేష్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో విద్యార్థులు

**ఈవీఎంపై అవగాహన:** ఈవీఎంలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ రెవెన్యూ అధికారులను పంపించి ఈవీఎంపై ఓటు ఎలా వేయాల్లో డీటీ సత్యనారాయణతోపాటు ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ వీరబ్రహ్మంతో అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్రత్యక్షంగా ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానంపై ప్రదర్శనగా చేసి చూపించారు.

**44మంది ఓటు నమోదు:** ఈ అవగాహన సదస్సులో విద్యార్థులు నూతనోత్సాహాన్ని పొందారు. 44 మంది కొత్తగా ఓటును నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ కళాశాలలో 548 మంది విద్యార్థులకు ఇప్పటివరకు 498 మంది ఓటును నమోదు చేసుకున్నారన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో ఈ రోజూ మిగిలిన వారిలో 44మంది ఫారం-6 ద్వారా ఓటును నమోదు చేయించుకోవడం ఆనందంగా ఉందన్నారు.

## ఆలోచించి ఓటు వేయాలి

ప్రతి ఒక్కరూ ఓటు తప్పనిసరిగా వేయాలి. తద్వారా దేశ, రాష్ట్ర భవిష్యత్తుకు ప్రయోజనం ఉంటుంది. ప్రలోభాలకు లొంగి ఓటు వేయడం వల్ల సమాజంలో అభివృద్ధి కుంటుపడుతోంది. ఆలోచించి ఓటును వేయడం ద్వారా సార్థకత చేకూరుతుంది.



–అన్నిక వెంకటేశ్, తృతీయ బీఎస్సీ

## ఓటరు ఐడీని ఆధార్‌కు లింక్ చేయాలి



ప్రజాస్వామ్యంలో ఓటును వినియోగించుకోవడం తప్పనిసరి. ముఖ్యంగా ఓటరు ఐడీకి ఆధార్ లింక్ లేకపోవడం వల్ల ఒకేసారి రెండు మూడు చోట్ల ఓటు వేయవచ్చు. దీనివల్ల చీటింగ్ జరుగుతుంది. తప్పనిసరిగా ఓటరు ఐడీకి ఆధార్‌ను లింక్ చేయాలి. దీంతో ఎన్నికల్లో పోటీ చేసిన వారికి న్యాయం జరుగుతుంది.

–పి.శైలజ, తృతీయ బీఎస్సీ

## ఉత్సాహంగా ర్యాలీ

'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు విద్యార్థులతో పాటు అధ్యాపకులు ఉత్సాహంతో ర్యాలీ చేశారు. ఓటును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సదస్సులో నేర్చుకున్న అంశాలను ఇక్కడదో వదిలేయకుండా ఇంటికి వెళ్లిన తర్వాత తల్లిదండ్రులకు కూడా చెప్పాలని పలువురు అధ్యాపకులు విద్యార్థులకు బోధించారు.

## ప్రలోభాలకు లొంగొద్దు

ఎన్నికల్లో ఓటును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలి. మద్యం, డబ్బులు ఇతర ప్రలోభాలకు లోను కాకుండా ఓటును వినియోగించుకుని మంచి నాయకున్ని ఎన్నుకోవాలి. అప్పుడే గెలుపొందిన ప్రజాప్రతినిధులను సమస్యలపై ప్రశ్నించే హక్కు ఉంటుంది.



– కె.శ్రీవిద్య, తృతీయ బీఎస్సీ(బీజెడ్‌సీ)